
సాక్షి
రంగారెడ్డి
శనివారం ౹ 11 ౹ అక్టోబర్ ౹ 2025



వృథాగా ఉందని పాగా..
వృథాగా ఉన్న నక్షబాట కబ్జాకు కొందరు రియల్టర్లు యత్నించారు. ధ్వంసం చేయగా.. గ్రామస్తులు అడ్డుకున్నారు. 8లో



పొలాలు పోతే బతికేదెట్లా?
పొలాలు పోతే బతికేదెట్లా అని బాధిత రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. 8లో



తడి పొడి చెత్త ఎక్కడ?
గ్రామ కార్యదర్శి, ఎంపీఓపై డీపీఓ సురేష్ మోహన్ మండిపడ్డారు. పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. 8లో

న్యూస్‌రీల్

రేపు పల్స్‌పోలియో

సాక్షి,రంగారెడ్డిజిల్లా: ఈనెల 12న (ఆదివారం) నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ లలితాదేవి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 4,20,911 మంది ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించినట్లు తెలిపారు. వీరిలో పట్టణ ప్రాంతంలో 1,99,967 మంది, గ్రామీణ ప్రాంతంలో 2,20,944 మంది పిల్లలు ఉన్నారని చెప్పారు. పట్టణ ప్రాంతంలో 422 పోలియో కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో 1,129 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 155 మంది రూట్ సూపర్‌వైజర్లు సహా 6,204 మంది సిబ్బందిని ఎంపిక చేసినట్లు, 9 మొబైల్ టీంలు, 18 ట్రాన్సిట్ పాయింట్స్ ఏర్పాటు చేసినట్లు ఆమె వివరించారు. తొలి రోజున పోలియో చుక్కలు వేయించుకోని వారికి 13 నుంచి 15వ తేదీ వరకు సిబ్బంది ఇంటింటికీ వేయనున్నట్లు వెల్లడించారు.

శంకర్‌పల్లిలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు ప్రతిపాదన

శంకర్‌పల్లి: పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో నాందేడ్- రాయచూర్, హైదరాబాద్- విజయపుర ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపేందుకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన దక్షిణ మధ్య రైల్వే బోర్డు సమావేశంలో ప్రతిపాదనను కేంద్ర రైల్వే బోర్డుకి పంపారు. పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని కోరుతూ ఇటీవల చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవని కలిసి వినతిపత్రం సమర్పించిన సంగతి తెలిసిందే. బోర్డు తుది ఆమోదం అనంతరం శంకర్‌పల్లిలో రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలువనున్నట్లు బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి శుక్రవారం విలేకరులకు తెలిపారు.

బీసీల ఆత్మగౌరవం దెబ్బతీస్తున్న ప్రభుత్వం

తుక్కుగూడ: రాష్ట్రంలో వెనుకబడిన తరగతులకు చెందినవారి ఆత్మగౌరవం దెబ్బతీసేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీసీ యువజన, విద్యార్థి సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు అనంతులు రామ్మూర్తి గౌడ్ అన్నారు. తుక్కుగూడలో శుక్రవారం ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికల అంశంపై హైకోర్టు స్టే విధించడం బాధాకరమన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కోర్టు స్టేపై ఈనెల 14న బీసీ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మహాధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ధర్నాలో బీసీలు అధిక సంఖ్యలో పాల్గొన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తారామతిపేటలో మొసలి కలకలం

జూపార్క్‌కు తరలించిన ఫారెస్ట్ అధికారులు



అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపల్ పరిధిలోని తారామతిపేటలో మొసలి కలకలం సృష్టించింది. శుక్రవారం ఉదయాన్నే పొలాలకు వెళ్తున్న రైతులకు ఊరి శివారులోని ఓ రేకుల షెడ్డు వద్ద మొసలి కనిపించడంతో స్థానికులకు సమాచారం అందించారు. దీంతో పెద్ద ఎత్తున జనం అక్కడికి చేరుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో మూసీ నది కాలువ నీటిలో నుంచి గ్రామంలోకి వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. ఈ విషయాన్ని ఫారెస్ట్, పోలీసు అధికారులకు చెప్పడంతో మొసలిని బంధించి నగరంలోని జూపార్క్‌కు తరలించారు. ఇది 12 అడుగుల పొడవు, 120 కిలోల బరువు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

'సెర్చ్'కు డూయింగ్ గుడ్ ఫర్ భారత్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సంస్థ ప్రతినిధులు

కందుకూరు: సెర్చ్ స్వచ్ఛంద సంస్థకు డూయింగ్ గుడ్ ఫర్ భారత్ అవార్డు–2025 వచ్చింది. అమేజాన్ సంస్థ సహకారంతో తెలుగు రాష్ట్రాల్లో లాభాపేక్ష లేకుండా జలవనరులు, పర్యావరణ పునరుద్ధరణ ద్వారా పర్యావరణ సమతుల్యం సాధించడంలో కీలక పాత్ర పోషిస్తున్నందుకుగాను ప్రకటించారు. ఢిల్లీలో శుక్రవారం జరిగిన 12వ ఇండియా సీఎస్ఆర్, ఈఎస్‌జీ సమ్మిట్‌లో కేంద్ర సమాచార ప్రచార శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ఎల్.మురగన్ చేతుల మీదుగా సంస్థ ప్రతినిధి పార్థసారధి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు తమకు సహకారం అందిస్తున్న అమేజాన్ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు.

కిక్కులేని లిక్కర్!

జిల్లాలో 249 మద్యం దుకాణాలు



- టెండర్లు ఆహ్వానించిన ప్రభుత్వం
- ఆసక్తి చూపని వ్యాపారులు
- ఇప్పటివరకు వచ్చింది 700లోపే దరఖాస్తులు
- లైసెన్స్ ఫీజు.. గుడ్‌విల్.. నిర్వహణ ఖర్చు ఎఫెక్ట్
- గతంతో పోలిస్తే ఆశించిన స్థాయిలో రాని అప్లికేషన్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లిక్కరుకు ఆశించిన కిక్కు దక్కడం లేదు. భూముల క్రయవిక్రయాలు తగ్గిపోవడం.. చేతిలో ఆశించిన స్థాయిలో డబ్బులేక పోవడం.. ప్రభుత్వం లైసెన్స్ ఫీజును భారీగా పెంచడం .. నిర్వహణ ఖర్చులు రెట్టింపు కావడం .. వెరసి మద్యం టెండర్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మద్యం దుకాణాలకు ప్రభుత్వం ఇటీవల టెండర్లు ఆహ్వానించిన విషయం తెలిసిందే. తెలంగాణలోనే అత్యధిక లిక్కర్ అమ్మకాలు జరిగే ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడం అబ్కారీ శాఖను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. టెండర్లు పిలిచాం.. దాఖలు చేయండి అంటూ మద్యం వ్యాపారులను అభ్యర్థిస్తుండడం విశేషం.

అడ్డుకుంటున్న సిండికేట్లు

శంషాబాద్ ఎక్సైజ్ జిల్లా పరిధిలో 111 మద్యం దుకాణాలు ఉండగా, సరూర్‌నగర్ ఎక్సైజ్ పరిధిలో 138 ఉన్నాయి. మేడ్చల్ జిల్లాలో 206, వికారాబాద్ జిల్లాలో 59 దుకాణాలున్నాయి. 2023 ఆగస్టులో జారీ చేసిన టెండర్ నోటిఫికేషన్‌లోని షాపుల సంఖ్యతో పోలిస్తే.. 2025 సెప్టెంబర్‌లో జారీ చేసిన నోటిఫికేషన్‌లో కొత్తగా 19 దుకాణాలు వచ్చి చేరాయి. గతంలో సరూర్‌నగర్ ఎక్సైజ్ జోన్ నుంచి 10,994 దరఖాస్తులు రాగా శంషాబాద్‌లో ఎక్సైజ్ జోన్ నుంచి మరో 10,611 అందాయి. దరఖాస్తుల ద్వారానే ప్రభుత్వానికి రూ.432.10 కోట్ల ఆదాయం సమకూరింది. ఈసారి మరింత ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావించింది. ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదు. 249 షాపులకు.. సంఖ్య ఇప్పటి వరకు 700 మించలేదు. ఇదిలా ఉండగా సరూర్‌నగర్, శంషాబాద్, గచ్చిబౌలి, హయత్‌నగర్ కేంద్రంగా వెలసిన పలు షాపులను ఎలాగైనా చేజిక్కించుకోవాలని పలువురు వ్యాపారులు భావిస్తున్నారు. అంతా సిండికేట్‌గా ఏర్పడి.. కొత్తగా మద్యం వ్యా పారంలోకి వచ్చే వాళ్లను టెండర్‌లో పాల్గొనకుండా అడ్డుకుంటున్నట్లు సమాచారం.

గుదిబండగా గుడ్‌విల్

గతంతో పోలిస్తే ప్రస్తుతం కొన్ని ఏరియాల్లో షాపుల సంఖ్య పెరిగింది. లైసెన్సు ఫీజును కూడా రూ.రెండు లక్షల నుంచి రూ.మూడు లక్షలకు పెంచారు. దీనికి తోడు ఎక్సైజ్‌కు ప్రతి నెలా గుడ్‌విల్ పేరుతో భారీగా చెల్లించుకోవాల్సి వస్తోంది. ఓపెన్ టెండర్‌లో పాల్గొని మద్యం దుకాణాన్ని దక్కించుకున్న వ్యాపారులు ఎక్సైజ్‌శాఖకు గుడ్‌విల్‌గా రూ.రెండు లక్షలు ఇచ్చుకోవాల్సి వస్తోంది. తర్వాత ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి ప్రతినెలా.. స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్), డీటీఎఫ్ విభాగానికి ఏడాదికి రెండు విడతల్లో రూ.25 వేల చొప్పున ముట్టజెప్పాల్సి వస్తోంది. ఇక షాపులకు మద్యం సరఫరా చేసే డిపోలకు ఒక్కో బిల్లుకు రూ.200 నుంచి రూ.300 చొప్పున ముడుపులు చెల్లించాల్సి వస్తోంది. అదనపు చెల్లింపులకు తోడు నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. వెరసి గతంలో ఒక్కో దుకాణానికి సగటున 92 దరఖాస్తులు రాగా, ప్రస్తుతం మూడు, నాలుగుకు మించడం లేదు. ఎక్సైజ్ అధికారులు మాత్రం దీన్ని కొట్టిపారేస్తున్నారు. మరో వారం గడువుందని, ఆఖరి నిమిషంలో వచ్చే దరఖాస్తులే ఎక్కువగా ఉంటాయని చెబుతున్నారు.

18తో ముగియనున్న గడువు

నూతన మద్యం పాలసీ ప్రకారం శంషాబాద్ ఎక్సైజ్ యూనిట్‌లోని మూడు స్టేషన్ల పరిధిలో మొత్తం 111 మద్యం షాపులు ఉన్నాయి. వీటిలో శంషాబాద్- 40, శేరిలింగంపల్లి-44, చేవెళ్ల-27 చొప్పున షాపులు ఉన్నాయి. సరూర్‌నగర్ ఎక్సైజ్ యూనిట్‌లోని ఆరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ల పరిధిలో మొత్తం 138 షాపులు ఉన్నాయి. వీటిలో సరూర్‌నగర్- 32, హయత్‌నగర్-28, ఇబ్రహీంపట్నం-19, మహేశ్వరం -14, ఆమనగల్లు- 17, షాద్‌నగర్-28 షాపులు ఉన్నాయి. దుకాణాల కేటాయింపులో రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. బీసీ గౌడ్స్‌కు 15 శాతం, ఎస్సీలకు పది, ఎస్టీలకు ఐదు శాతం చొప్పున కేటాయించారు. వీటికి సంబంధించిన దరఖాస్తులను బండ్లగూడ జాగీర్‌లోని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ అకాడమీ (ఈస్ట్)లో స్వీకరిస్తున్నారు. లిక్కర్ షాపు కావాల్సిన వ్యాపారులు స్వయంగా వచ్చి వారి అప్లికేషన్లు సంబంధిత కౌంటర్లలో అందజేయాల్సి ఉంది. ఈనెల 18 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీగా నిర్ణయించారు. ఆయా దరఖాస్తుదారుల సమక్షంలో ఈ నెల 23న లాటరీ నిర్వహించనున్నారు.

తడిసిమోపెడు!



యాచారం మండలంలోని జెడ్పీటీసీ స్థానం బీసీ జనరల్‌కు కేటాయించారు. ఓ ప్రధాన పార్టీకి చెందిన నేత జెడ్పీటీసీ టికెట్ తనకే వస్తుందని ఆశించాడు. గెలవాలంటే కనీసం రూ.కోటిన్నర ఖర్చవుతుందని మద్దతుదారులు తెలిపారు. డబ్బు కోసం తెలిసిన వాళ్ల వద్దకు వెళ్లినా ప్రయోజనం లేకపోయింది. దీంతో స్నేహితుడి ద్వారా నగరంలోని ఓ వడ్డీ వ్యాపారిని ఆశ్రయించాడు. డబ్బులిస్తా.. కానీ రూ.వందకు రూ.5 వడ్డీ అని తెలిపాడు. సరేనని తన కుటుంబ సభ్యుల పేరు మీద నల్లగొండ జిల్లాలోని ఓ గ్రామంలో ఉన్న రూ.3 కోట్లకు పైగా విలువచేసే ఐదెకరాల వ్యవసాయ భూమిని ఆరు నెలల చెల్లింపు గడువుతో వడ్డీ వ్యాపారికి రిజిస్ట్రేషన్ చేశాడు. తీరా హైకోర్టు స్టే విధించడంతో లబోదిబోమంటున్నాడు.

- స్థానిక ఎన్నికలకు ఆశావహుల పోటీ
- రిజర్వేషన్లు అనుకూలించడంతో పలువురి ఆసక్తి
- అప్పులు చేసి మరీ సమరానికి సన్నద్ధం
- హైకోర్ట్ బ్రేక్‌తో ఒక్కసారిగా కలవరం
- తెచ్చిన రుణాలపై ఆందోళన

యాచారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చిన ఆశావహులంతా చాలావరకు వడ్డీ వ్యాపారుల తలుపులే తట్టారు. పోటీదారులకంటే అధనంగా ఖర్చు చేస్తేనే గెలుస్తామనే ఉద్దేశంతో వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఇళ్లను రిజిస్ట్రేషన్లు చేసి మరీ అప్పులు తెచ్చుకున్నారు. రిజర్వేషన్లు ప్రకటించిన మరుసటి రోజు నుంచే డబ్బుల జమపై దృష్టి పెట్టారు. జెడ్పీటీసీకి పోటీ చేయాలంటే రూ.కోటిన్నర, ఎంపీపీ కావాలంటే రూ.2 కోట్లకు పైగా, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడిగా గెలవాలంటే కనీసం రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షలు, మేజర్ పంచాయతీలు, మండల కేంద్రాలైతే రూ.కోటికిపైగా ఖర్చవుతుందని అంచనా వేశారు. ఫ్యూచర్‌సిటీ ఏర్పాటవుతున్న యాచారం, కందుకూరు, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కడ్తాల్, ఆమనగల్లు, మంచాల మండలాల్లోని అనేక గ్రామాల్లో గెలవాలంటే అత్యధికంగా ఖర్చు చేస్తేనే సాధ్యమని అందినకాడికి అప్పులు చేశారు.

డబ్బులిస్తాం.. మళ్లీ రిజిస్ట్రేషన్లు చేస్తారా?

ఎన్నికలకు హైకోర్ట్ బ్రేక్ వేయడంతో ఇప్పట్లో జరిగే అవకాశాలు కనిపించడం లేదు. ఒకవేళ మళ్లీ నోటిఫికేషన్ వచ్చినా ఇవే రిజర్వేషన్లు ఉంటాయో.. లేదో తెలియదు. ఈ క్రమంలో అప్పులు తెచ్చుకున్న ఆశావహులంతా వడ్డీ వ్యాపారుల వద్దకు పరుగులు పెడుతున్నారు. 'మీ డబ్బులు మీకు ఇచ్చేస్తాం.. మా వ్యవసాయ భూములు, ప్లాట్లు మళ్లీ మా పేర్లపై రిజిస్ట్రేషన్లు చేయండి' అంటూ ప్రాధేయపడుతున్నారు. మధ్యవర్తులను సంప్రదించి కమీషన్లు ఇస్తాం.. వడ్డీ వ్యాపారులను ఒప్పించి తిరిగి తమ ఆస్తులు తమ పేర్లపై నమోదు చేయించండి అంటూ బతిమిలాడుతున్నారు. వడ్డీ వ్యాపారులు మళ్లీ రిజిస్ట్రేషన్లు చేస్తాం కానీ ఒప్పందం ప్రకారం ఆరు నెలల వడ్డీ చెల్లించండని తెగేసి చెబుతున్నారు. దీంతో వడ్డీలకు తెచ్చిన డబ్బును తిరిగి వ్యాపారులకు ఇవ్వలేక.. ఇంట్లో ఉంచుకోలేక ఆశావహులకు కంటికి కునుకు లేకుండాపోతోంది.

పార్కు స్థలం కబ్జాపై హైడ్రా కొరడా



అక్రమ నిర్మాణం కూల్చివేత

హయత్‌నగర్: పార్కు స్థలం ఆక్రమణపై హైడ్రా కొరడా ఝులిపించింది. పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ పరిధిలోని శ్రీ లక్ష్మి గణపతి కాలనీలోని సుమారు 700 గజాల స్థలంలో నిర్మించిన ప్రహరీని కూల్చివేసి స్థలాన్ని విడిపించారు. తట్టిఅన్నారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 76/ఎలో 9.24 ఎకరాల భూమిలో గతంలో లేఅవుట్ చేసి ప్లాట్లను విక్రయించారు. లేఅవుట్‌లో సుమారు 2,800 గజాల ఖాళీ స్థలాన్ని ప్రజా అవసరాల కోసం వదిలేశారు. ఇందులో 700 గజాల స్థలం పురాతన బావి దగ్గర ఉంది. కొంత కాలంగా ఈ స్థలంపై కన్నేసిన స్థానిక నాయకుడు సుమారు 270 గజాలు కొన్నట్లు డాక్యుమెంట్లు సృష్టించి ప్రహరీ నిర్మించాడు. స్థలం ఆక్రమణపై కాలనీవాసులు కొంత కాంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో గత మార్చిలో ప్రజావాణిలో హైడ్రాకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు వివరాలు సేకరించి పార్కు స్థలం కబ్జాకు గురైనట్లు గుర్తించారు. దీంతో శుక్రవారం ఉదయం జేసీబీలతో అక్కడికి చేరుకుని అక్రమంగా నిర్మించిన ప్రహరీని తొలగించారు.

'బ్రిలియంట్'లో రూ.1.07 కోట్లు చోరీ

- ఫీజు డబ్బులను కాలేజీ ఆఫీసులో భద్రపర్చిన సిబ్బంది
- బీరువా తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడిన దుండగులు
- సీసీ కెమెరాలు, డీవీఆర్ బాక్స్‌ను సైతం తీసుకెళ్లిన వైనం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీసీపీ అనురాధ
- త్వరలోనే దొంగలను పట్టుకుంటామని వెల్లడి



దొంగలు ధ్వంసం చేసిన బీరువా



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ అనురాధ తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: నగర శివారులోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో భారీ చోరీ జరిగింది. ఫీజుల రూపంలో విద్యార్థుల నుంచి వసూలు చేసిన రూ.1.07 కోట్లు అపహరణకు గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని బ్రిలియంట్ ఇంజనీరింగ్ విద్యాసంస్థకు చెందిన మూడు కాలేజీల్లో సిబ్బంది నాలుగు రోజులుగా ఫీజు డబ్బులు వసూలు చేశారు. అకౌంటెంట్ సెలవులో ఉండటంతో రూ.1.07 కోట్ల నగదును గురువారం కాలేజీ ఆవరణలోని ఆఫీసు బీరువాలో భద్రపర్చి, ఎప్పటిలాగే తాళాలు వేసి సాయంత్రం 6గంటలకు ఇళ్లకు వెళ్లారు. శుక్రవారం ఉదయం 8.45 గంటలకు వచ్చిచూడగా మెయిన్ డోర్ ధ్వంసం చేసి ఉండటాన్ని గమనించారు. ఆఫీసు రూమ్ వద్దకు వెళ్లగా బీరువా తలుపులు తెరిచి ఉండటం, అందులోని డబ్బు కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. ఈ విషయమై కళాశాల ఏఓ కేశినేని కుమార్ పీఎస్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చోరీ జరిగిన ప్రాంతంతో పాటు పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఇదిలా ఉండగా చోరీకి పాల్పడిన దుండగులు మెయిన్ డోర్‌ను ధ్వంసం చేసి లోనికి చొరబడ్డారు. సీసీ కెమెరాలతో పాటు డీవీఆర్ బాక్స్‌ను సైతం ఎత్తుకెళ్లారు. ఎల్‌బీనగర్ డీసీపీ అనురాధ, వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అశోక్‌రెడ్డి కాలేజీకి చేరుకుని సిబ్బందిని విచారించారు. చోరీకి పాల్పడిన వారిని త్వరలోనే పట్టుకుంటామని, ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. ఇదిలా ఉండగా అధికార పార్టీకి చెందిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కాలేజీలో పెద్ద మొత్తంలో డబ్బు చోరీకి గురికావడం చర్చనీయాంశంగా మారింది.

క్రీడాకారులకు ప్రోత్సాహం

షాబాద్: చదువుతోపాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులను ప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సహిస్తోందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో ఎంఆర్ ట్రస్ట్ సహకారంతో కొనసాగుతున్న 69వ మండలస్థాయి తెలంగాణ స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలు శుక్రవారంతో ముగిసాయి. బహుమతుల ప్రదానోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వారికి నచ్చిన క్రీడను ఎంచుకుని జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడలకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తనవంతుగా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, గుండాల అశోక్, మాజీ సర్పంచులు నర్సింలు, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌గౌడ్, లింగం, నాయకులు సుభాష్ రెడ్డి, రాహుల్, రఫీక్, సూర్య, శ్రీనివాస్, శేఖర్, మాధవ్ రెడ్డి, సాయి పాల్గొన్నారు.



విజేతలకు బహుమతుల ప్రదానం

బీసీలకు న్యాయం జరిగే దాకా పోరాటం



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న నాయకులు

బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ

షాబాద్: బీసీలకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడంపై శుక్రవారం మండల కేంద్రంలో బీసీ సేన ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దుకాణాలు బంద్ చేయించారు. అనంతరం ముంబై–బెంగళూరు లింకు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బర్క కృష్ణ మాట్లాడుతూ.. బీసీలకు రిజర్వేషన్ల విషయంలో తీరని అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలను అణగదొక్కుతూ, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగొద్దన్న ఉద్దేశంతో ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలుచేసేదాక పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వెంకట్‌యాదవ్, రవీందర్, బీసీ సేన మండల అధ్యక్షుడు దయాకర్‌చారి, ఉపాధ్యక్షుడు బాలరాజ్, యూత్ అధ్యక్షుడు అజయ్‌కుమార్, నాయకులు రాపోలు నర్సింహులు, చంద్రయ్య, సత్యం, చెన్నయ్య, మల్లేష్, మహేందర్, విఠలయ్య, శ్రీశైలం, నారాయణ, రాఘవచారి, స్వామి, గోపాల్, కుమ్మరి శ్రీను, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జోనల్ స్థాయి కబడ్డీ పోటీలు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని బాటసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజులుగా జరుగుతున్న హయతనగర్ జోనల్ స్థాయి 69వ కబడ్డీ టోర్నమెంట్ కం సెలక్షన్స్ శుక్రవారంతో ముగిశాయి. కార్యక్రమానికి హాజరైన హయతనగర్ జోనల్ సెక్రటరీ నిర్మల మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి అండర్-14, అండర్-17 బాలికలు, బాలురు మొత్తం 1,500 మంది క్రీడాకారులు పాల్గొన్నట్టు తెలిపారు. జోనల్ స్థాయిలో ఇంత పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొనడం ఇదే మొదటిసారని అన్నారు. పోటీలు విజయవంతమయ్యేలా కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

విజేతలుగా వీరే..

- అండర్ -14 బాలికల విభాగంలో జెడ్పీహెచ్ఎస్ పెద్దఅంబర్‌పేట, రన్నర్స్‌గా ఇంజాపూర్ జెడ్పీస్కూల్ జట్లు నిలిచాయి.
- అండర్ -14 బాలుర విభాగంలో హయత్‌నగర్ జెడ్పీ స్కూల్ జట్టు ప్రథమ, తారమతిపేట జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి.



అండర్ -17 బాలుర విభాగంలో విజేతగా నిలిచిన బాటసింగారం జెడ్పీ స్కూల్ జట్టుకు బహుమతి ప్రదానం

- అండర్–17 బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో ఎంజేపీ హయత్‌నగర్ జట్టు, ద్వితీయ స్థానంలో తారమతిపేట జట్టు నిలిచాయి.
- అండర్–17 బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో జెడ్పీహెచ్ఎస్ బాటసింగారం.. ద్వితీయ స్థానంలో న్యూ చైతన్య స్కూల్ జట్లు నిలిచాయి.

పొలాలు పోతే బతికేదెట్లా?



ముట్పూర్ శివారులో రోడ్డు మార్కింగ్‌ను పరిశీలిస్తున్న గ్రామస్తులు

అన్నదాతల ఆవేదన..

- రేడియల్ రోడ్డుపై వ్యతిరేకత

కొందుర్గు: 'అభివృద్ధి పనుల పేరిట చేపట్టనున్న రోడ్డు నిర్మాణం.. నేల తల్లిని నమ్ముకున్న మాకు శాపంగా మారింది. జీవనోపాధి కోల్పోతాం. రోడ్డున పడతాం' అని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్‌రోడ్డును కలిపేందుకు నిర్మించ తలపెట్టిన రేడియల్ రోడ్డుకు ఓ వైపు ఆర్‌వీ ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ.. శుక్రవారం సర్వే పనులు చేస్తుండగా.. సమీపాన సాగుభూములు కలిగిన కర్షకులు.. ఆందోళన చెందారు. పొలాలు పోతే బతికేదెట్లా అని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి తమ పొలాల నుంచి రోడ్డు వెళ్లకుండా చూడాలని కోరుతున్నారు. ఇదే విషయమై తహసీల్దార్ అజాంఅలీ ఖాన్‌ను వివరణ కోరగా.. రోడ్డు మార్కింగ్ చేస్తున్నట్లు తమకు ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు.



షాబాద్ శివారు వద్ద రోడ్డు సర్వే చేస్తున్న కన్సల్టెన్సీ సిబ్బంది

మూడు ప్రతిపాదనలు సిద్ధం

సర్వే పనులు మొదలు పెట్టిన కన్సల్టెన్సీ ప్రతినిధులు మాట్లాడుతూ.. షాబాద్ మండల కేంద్రం మీదుగా చుక్కమెట్టు, ముట్పూర్, ఉమ్మెంత్యాల నుంచి పరిగి మండలం గూడూరు వరకు 55 కిలో మీటర్ల వరకు ఈ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు. అయితే ఈ రహదారికి సంబంధించి మూడు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, ప్రభుత్వం ఏదైనా ఒక దానిని ఆమోదం తెలప వచ్చని పేర్కొన్నారు.

క్రీడాకారులకు అభినందన

యాచారం: ఇబ్రహీంపట్నం డివిజన్‌లో ఈ నెల 7,8,9న నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో.. ప్రతిభచాటి జిల్లా స్థాయికి ఎంపికైన ఉన్నత పాఠశాల విద్యార్థినులను శుక్రవారం ఉపాధ్యాయులు అభినందించారు. అండర్‌-14 విభాగంలో ద్వితీయ, అండర్‌- 17 విభాగంలో తృతీయ స్థానంలో నిలిచి, జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను మండల విద్యాధికారి పాండురంగారెడ్డి, హెచ్‌ఎం నర్సింహ తదితరులు అభినందించి, సన్మానించారు.



విద్యార్థినులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి పట్టివేత

రూ.16.5 లక్షల విలువైన 33 కేజీలు స్వాధీనం

నాంపల్లి: కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో గురువారం రాత్రి పోలీసులు భారీగా గంజాయిని పట్టుకున్నారు. రైల్వే డీఎస్పీ ఎస్.ఎన్.జావేద్, నార్కొటిక్ ఈగల్ టీమ్ డీఎస్పీ పి.భిక్షపతి రావు తెల్పిన మేరకు..ఒడిశాకు చెందిన కిషోర్ లిమా తన అనుచరులు రాజేష్ బిసోయ్, సుజాతా సింగ్ అనే ఇద్దరు కూలీల ద్వారా కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో 16 పాకెట్లలో 33 కేజీల గంజాయిని ముంబైకి రవాణా చేసేందుకు ప్లాన్ చేశాడు. ఈ మేరకు కూలీలు ఇద్దరూ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు థర్డ్ ఏసీ బోగీలో ఉండగా..రైలు బేగంపేట రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే పోలీసులు తనిఖీలు చేపట్టారు. తనిఖీలు చేస్తున్నారన్న భయంతో కూలీలిద్దరు రైలు దిగి ప్లాట్ ఫారం మీదకు వెళ్లారు. అక్కడ నుంచి ఏసీ వెయిటింగ్ హాలులోకి చేరుకున్నారు. పోలీసులకు అనుమానం రావడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయిని ముంబైకి తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారు. దీంతో వారి వద్ద ఉన్న రూ.16.5 లక్షల విలువైన 33 కేజీల గంజాయిని, రెండు సెల్‌ఫోన్లు, రైలు టికెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కిషోర్ లిమా కోసం గాలిస్తున్నారు.

బైక్‌పై.. నలుగురు మైనర్లు

పోలీసుల హెచ్చరికలు పట్టించుకోని పెద్దలు

దోమ: బాలబాలికలకు బైక్‌లు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్న పోలీసుల హెచ్చరికలను పెద్దలు పట్టించుకోవడం లేదు. ఇందుకు నిదర్శనం.. ఒక ద్విచక్ర వాహనంపై ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా నలుగురు మైనర్లు దూసుకు పోతున్న చిత్రమే. వివరాలు ఇలా ఉన్నాయి. దోమ ఠాణా పరిధిలో శుక్రవారం నలుగురు బాలలు నిబంధనలకు విరుద్ధంగా బైక్‌పై ప్రయాణం సాగించారు. వారిని చూసిన వారు ఆశ్చర్యానికి గురయ్యారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని, పిల్లలకు బైక్‌లు ఇవ్వద్దని చెబుతున్నా తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదన్నారు. పోలీసులు స్పందించి, ఇలాంటి వాటిపై పెద్దలకు అవగాహన కల్పించి, ఇలాంటి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వృథాగా ఉందని పాగా..

నక్షబాట కబ్జాకు యత్నం

- జేసీబీ సహాయంతో ధ్వంసం
- అడ్డుకున్న గ్రామస్తులు..
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన రెవెన్యూ అధికారులు



ధ్వంసమైన నక్షబాట

కేశంపేట: వృథాగా ఉన్న నక్షబాట కబ్జాకు కొందరు రియల్టర్లు యత్నించారు. కుట్రలో భాగంగా జేసీబీ సహాయంతో దానిని ధ్వంసం చేయగా.. గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సంఘటన శుక్రవారం వేముల్‌నర్వ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కేశంపేట మండలం వేముల్‌నర్వ నుంచి షాద్‌నగర్‌- కేశంపేటకు రాకపోకలు సాగించేందుకు గ్రామశివారులోని 285, 284, 274 సర్వే నంబర్లలో నక్షబాట ఉండేది. ఈ మార్గం గుండా దేవరకొండ, జడ్చర్లకు సర్వీసులు నడిచేవి.

పొలాల మీదుగా ఉందని..

ప్రత్యామ్నాయంగా గతంలో షాద్‌నగర్‌- కేశంపేటకు మరో మార్గాన్ని.. సర్వే నంబర్ 232లోని ప్రభుత్వ భూమిని దాటిన తరువాత సర్వే నంబర్ 285 మీదుగా కాకుండా 233, 238, 239 సర్వే నంబర్ల మీదుగా రోడ్డును నిర్మించారు. నాటి నుంచి వాహనాలు ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలో వేముల్‌నర్వ సమీపంలోని 274, 275, 276 సర్వే నంబర్లలో స్థిరాస్తి వ్యాపారులు కొందరు భూములను కొనుగోలు చేశారు. అయితే వారు కొనుగోలు చేసిన పొలాల మీదుగా ఉన్న బాట వృథాగా ఉందని, దానిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు.

రికార్డులు పరిశీలించి..

నక్షబాట కబ్జా విషయంపై కొందరు గ్రామస్తులు.. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. రికార్డులను పరిశీలించి, నక్షాబాట ఉందని తేల్చారు. ఎట్టి పరిస్థితుల్లో ఆ బాటను ధ్వంసం చేయవద్దని చెప్పారు. బాటతో పాటు పక్కనే నాయినోని చెరువు ఉందని స్పష్టం చేశారు. అనంతరం రియల్టర్లు మాట్లాడుతూ.. వెంచర్ ఏర్పాటు చేసేందుకు హెచ్‌ఎండీఏ అనుమతులు తీసుకున్నామని, సంబంధిత పత్రాలను తహసీల్ కార్యాలయంలో అందజేస్తామని అధికారులకు తెలిపారు.

ప్రవాహానికి అడ్డుగా మట్టి

వెంచర్ ఏర్పాటు చేస్తున్న భూములు మీదుగా వాగు ప్రవాహం వచ్చేందుకు గతంలో కల్వర్టును నిర్మించారని ప్రాంత రైతులు తెలిపారు. కానీ రియల్టర్లు వాగునీటి ప్రవాహానికి అడ్డుగా మట్టిని పోస్తున్నారని చెప్పారు. ఇదేమిటని ప్రశ్నించగా.. వాగు నీరు వెళ్లడానికి ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేస్తామని రియల్టర్లు సమాధానం చెప్పారని బాధితులు పేర్కొన్నారు. అలా జరిగితే తమ పొలాలు సాగుకు పని రాకుండా పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే అంశంపై రెవెన్యూ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు చెప్పారు.



రెవెన్యూ రికార్డుల్లో కనిపిస్తున్న నక్షబాట

మహాసభలను జయప్రదం చేయండి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

మీర్‌పేట: సీఐటీయూ రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు దాసరి బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం పురపాలిక కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులతో కలిసి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ.. తుర్కయంజాల్ పట్టణంలో ఈ నెల 14,15న నిర్వహించనున్న సభలో.. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చిస్తామని తెలిపారు. కావున కార్మికులు పెద్ద సంఖ్యలో రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరిచారి, కమలమ్మ, లలిత, బావమ్మ, బుచ్చమ్మ, స్వరూప, పున్నమ్మ, శోభ, శ్రీకాంత్, సతీష్, సత్తయ్య పాల్గొన్నారు.

ఖాతాదారులకు జవాబుదారీగా ఉండాలి

తుక్కుగూడ: ఖాతాదారులకు జవాబుదారీగా ఉండాలని తపాలా శాఖ ఏఎస్పీ జోయల్ అన్నారు. శుక్రవారం పుర పరిధి మంఖాల్ పోస్టాఫీస్‌ను ఆయన తనిఖీ చేసి, మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తపాలా కార్యాలయం ద్వారా తక్కువ ప్రీమియంతో బీమా సౌకర్యం కలిపిస్తుందని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే పథకాల గురించి విస్తృతంగా ప్రచారం చేయా లని సిబ్బందికి సూచించారు. కార్యాలయానికి వచ్చే లేఖలు, వివిధ పత్రాలను సకాలంలో ప్రజలకు చేరవేయాలని చెప్పారు. అనంతరం అంతర్జాతీయ తపాల దినోత్సవం సందర్భంగా కార్యాలయ ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో శాఖ ఎస్‌పీఎం నవీన్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోస్తున్న తపాల సిబ్బంది

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక





రంగారెడ్డి జిల్లా: హయత్‌నగర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్‌- 19 ఎస్‌జీఎఫ్ బాలుర కబడ్డీ విభాగంలో కందుకూరు (నిశిత క్యాంపస్) మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ బ్యాక్‌వర్డ్ క్యాస్ట్స్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్) కళాశాల నుంచి పి.శ్రీనాథ్, కార్తీక్‌రెడ్డి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దీప, కళాశాల స్టాఫ్, పీడీ గణేశ్, పీఈటీ హనుమంత్ తదితరులు శుక్రవారం విద్యార్థులను అభినందించారు. రంగారెడ్డి జిల్లా నుంచి స్టేట్ లెవల్‌కు ఎంపికైన శ్రీనాథ్, కార్తీక్‌రెడ్డి మహబూబాద్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

తడి, పొడి చెత్త ఎక్కడ?

- వర్మీ కంపోస్టు తయారీ ఎంత?
- గ్రామ అధికారులపై డీపీఓ సురేష్ మోహన్ ప్రశ్నల వర్షం

నందిగామ: 'గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తను ఎక్కెడెక్కడ నిల్వ ఉంచారు. ఎంత మేర వర్మీ కంపోస్టు తయారు చేశారు' అని డీపీఓ సురేష్ మోహన్.. రంగాపూర్ గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఎంపీఓ తేజ్ సింగ్‌లను ప్రశ్నించారు. దీనికి వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగాపూర్‌లో కంపోస్టు యార్డును శుక్రవారం డీపీఓ తనిఖీ చేశారు. నిర్వహణ సరిగా లేకపోవడంతో సంబంధిత అధికారులైన గ్రామ కార్యదర్శి, ఎంపీఓపై మండిపడ్డారు. తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, కంపోస్టు యార్డుకు తరలించాలని, పరిసరాలను పరిశుభ్రగా ఉంచాలని ఆదేశించారు. వారంలోపు పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. ఎన్నికల బిజీ కారణంగా కొంత నిర్లక్ష్యం జరిగిందని, వారం రోజుల్లో కంపోస్టు యార్డుల్లో తడి పొడి చెత్తను వేర్వేరుగా వేసి, కంపోస్టును తయారు చేస్తామని ఎంపీఓ తేజ్ సింగ్.. డీపీఓకు వివరణ ఇచ్చారు.



గ్రామ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీపీఓ సురేష్ మోహన్

లక్ష గాంధీ విగ్రహాల సేకరణ షురూ



గాంధీ విగ్రహాల ప్రదర్శన

హయత్‌నగర్: మహాత్మాగాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేయడంలో భాగంగా పలు రూపాల్లో ఉన్న లక్ష గాంధీ విగ్రహాలను సేకరించే కార్యక్రమం చేపట్టినట్టు గ్లోబల్ ఫ్యామిలీ వ్యవస్థాపక అధ్యక్షుడు గున్న రాజేందర్‌రెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలోని కుంట్లూర్‌లో గల గాంధేయన్ కళాశాలలో శుక్రవారం లక్ష విగ్రహాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష గాంధీ విగ్రహాలను సేకరించి ప్రజలకు అందించడం ఒక ఉద్యమంగా చేపట్టామని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు గాంధీ మార్గమే ఉత్తమమైనదని పేర్కొన్నారు. గాంధీ తత్వాన్ని యువతకు, రాబోయే తరాలకు అందించడమే లక్ష్యంగా విగ్రహాలు సేకరిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహాలతో గాంధీ విగ్రహాల సేకరణ అనే అక్షరమాలను ప్రదర్శించారు. సంస్థ ఉపాధ్యక్షుడు యానాల ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కన్వీనర్ గాంధారి ప్రభాకర్ పాల్గొన్నారు.

బాణసంచా అక్రమ నిల్వలపై టాస్క్‌ఫోర్స్ నజర్

రూ.18 లక్షల సరుకు స్వాధీనం చేసుకున్న టీమ్

సాక్షి, సిటీబ్యూరో: దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో బాణసంచా అక్రమ నిల్వలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు కన్నేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా నగర వ్యాప్తంగా నిఘా ముమ్మరం చేశారు. ఫలితంగా ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ బృందానికి రూ.18 లక్షల విలువైన సరుకు చిక్కినట్లు అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు శుక్రవారం వెల్లడించారు. బొగ్గులకుంటకు చెందిన శ్యామ్ కుమార్ సుగంధి సిద్ధ అంబర్‌బజార్‌లో ఓ గోదాం నిర్వహిస్తున్నారు. ఎలాంటి అనుమతులు, ముందు జాగ్రత్త చర్యలు లేకుండా అందులో భారీగా బాణాసంచా నిల్వ ఉంచారు. జనావాసాల మధ్య ఈ గోదాం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిసినా అతడు నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. నగర వ్యాప్తంగా ఉన్న బాణాసంచ అక్రమ నిల్వలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు కొన్ని రోజులుగా ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈస్ట్‌జోన్ బృందానికి శ్యామ్ కుమార్ గోదాంపై సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ నేతృత్వంలో ఎస్సైలు ఎం.అనంతాచారి, ఎస్.కరుణాకర్‌రెడ్డి, పి.నాగార్జున తమ బృందాలతో దాడి చేసి శ్యామ్‌ను అదుపులోకి తీసుకున్నారు. మొత్తం రూ.18 లక్షల విలువైన సరుకు స్వాధీనం చేసుకుని కేసును అఫ్జల్‌గంజ్ పోలీసులకు అప్పగించారు.

బాలిక సాహసం.. ఉడాయించిన దొంగ

సాక్షి, సిటీబ్యూరో: తమ పొరుగింట్లో చోరీకి యత్నించిన దొంగను ఓ బాలిక తరిమికొట్టింది. దొంగతనాన్ని నివారించి అందరి ప్రశంసలు అందుకుంది. వివరాల్లోకి వెళ్తే..చింతల్, భగత్‌సింగ్ నగర్, రోడ్ నంబర్ 12లోని ఓ ఇంట్లో కావలి భవానీ అనే 13 ఏళ్ల బాలిక కుటుంబంతో కలిసి నివసిస్తోంది. తమ కింద పోర్షన్‌లో ఉమా మహేశ్వరి, చంద్రశేఖర్ దంపతులు నివసిస్తుండగా..వారు గురువారం రాత్రి బయటకు వెళ్లడం చూసి ఓ 20 ఏళ్ల యువకుడు దొంగతనం కోసం ఇంట్లోకి ప్రవేశించాడు. కిందింట్లో అలికిడి గమనించిన భవానీ అక్కడికి వెళ్లి ఎవరు నువ్వు అని నిలదీయడంతో యువకుడు బయటకు పరుగెత్తాడు. భవాని అంతటితో వదిలి పెట్టకుండా కేకలు పెడుతూ చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేస్తూ దుండగుడిని వెంబడించింది. వీధి చివర ప్రణవ్ ఇంటర్నేషనల్ స్కూల్ వరకు తరుముతూ వెళ్లింది. సీసీ కెమెరా రికార్డు ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులతోపాటు కాలనీ వాసులు భవానిని ప్రశంసించారు.

తెలంగాణ భవన్‌కు తాళాలు వేసేందుకు యత్నం

నలుగురు అరెస్టు

బంజారాహిల్స్: బీఆర్ఎస్ పార్టీ బాకీ కార్డులో తెలంగాణ ఉద్యమకారుల హామీలు పొందుపరచలేదని ఆరోపిస్తూ వినతిపత్రం ఇవ్వడంతో పాటు తెలంగాణ భవన్‌కు తాళాలు వేసేందుకు వెళ్లిన నలుగురు తెలంగాణ ఉద్యమకారులను బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. మన తెలంగాణ తొలి దశ, మలి దశ ఉద్యమకారుల జేఏసీ నేతలు తెలంగాణ కొమురయ్య, శ్యామా అంజిరెడ్డి, మచ్చ సోమనారి, చెరుకుపల్లి నాగేశ్వరరావు తదితరులు శుక్రవారం ఉదయం బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌కు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ లోనికి చొచ్చుకువెళ్లేందుకు ప్రయత్నించారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేస్తామంటూ పోలీసులకు చెప్పగా అనుమతించలేదు. తాము వినతిపత్రంతో పాటు తమ హామీలు నెరవేర్చని తెలంగాణ భవన్‌కు తాళాలు వేసేందుకు ప్రయత్నించామని, తమను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశామన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు సముచిత గౌరవాన్ని కల్పించడం కోసం చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు.

ఎన్నికల ఖర్చుకు డబ్బు ఇవ్వాలంటూ పోస్ట్

వ్యక్తిపై కేసు నమోదు

బంజారాహిల్స్: తాను జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీ చేస్తున్నానని, అయితే తాను సామాన్యుడినని, నామినేషన్ వేసే ప్రక్రియ నుంచి ఎన్నికల దాకా తనకు ఖర్చుల కోసం ఒక్కొక్కరు రూ.100 నుంచి ఎంతైనా ఆర్థికంగా సహాయపడాలంటూ ఓ వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడమే కాకుండా క్యూఆర్ కోడ్ కూడా ఇచ్చాడు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా సదరు వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడని జూబ్లీహిల్స్ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి పి.సాయిరాం బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అభినయ్ దర్శన్ అనే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన అభినయ్ దర్శన్ అనే యువకుడు రెండు రోజుల క్రితం సోషల్ మీడియాలో తనకు ఎన్నికల ఖర్చు నిమిత్తం ప్రతిఒక్కరూ రూ.100 ఆర్థిక సహాయం చేయాల్సిందిగా పోస్ట్ చేశాడు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఓపెన్ అయిన తర్వాత అభినయ్ దర్శన్ అని వస్తుందని, దానికి డబ్బులు పంపాలని వీడియో షేర్ చేశాడు. స్తోమతకు తగినట్లుగా సహాయం చేస్తే ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తానని పేర్కొన్నాడు. తాను విధి నిర్వహణలో ఉండగా అభినయ్ దర్శన్ వీడియో చూడడం జరిగిందని, ఇది ఎన్నికల నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆర్వో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు అభినయ్ దర్శన్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై చర్యలకు డిమాండ్

కుల్కచర్ల: లంబాడాలను కించపరిచేలా మా ట్లాడిన తుడుందెబ్బ నేత మైపతి అరుణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఐ రమేష్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధంగా గిరిజనులను ఎస్టీ జాబితాలో చేర్చారని తెలిపారు. అయినప్పటికీ.. అరుణ్‌కుమార్.. భద్రాచలం ఆత్మగౌరవ సభలో లంబాడ ఆడబిడ్డలను అగౌరపరిచేలా మాట్లాడారని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజేందర్ రాథోడ్, ప్రకాష్ నాయక్, గోపాల్ నాయక్, సురేష్ నాయక్ పాల్గొన్నారు.